


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 29 జనవరి 2022 సంపుటి: 03 సంచిక: 148 పేజీలు: 4 వెల: రూ 3-00


# సీఎం వైఎస్ జగన్ సమక్షంలో అమూల్‌తో ఎంవోయూ









అమరావతి: సహకార డెయిరీ రంగంలో అంతర్జాతీయ కీర్తినార్జించిన 'అమూల్' సంస్థ ద్వారా రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు ఇకపై ఏపీలోనే తయారైన పాలు, బాలామృతాన్ని పూర్తిస్థాయిలో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగానే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం నేడు (శుక్రవారం) అమూల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. 'ఈ రోజు మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. అనంతపురం జిల్లాలోని 85 గ్రామాల్లో జగనన్న పాలవెల్లువకు అమూల్ శ్రీకారం చుడుతోంది. ఇది మంచి పరిణామం. వ్యవసాయానికి పాడి రైతులు తోడైతేనే గిట్టుబాటు ధర లభిస్తుంది. అమూల్ దేశంలోనే నెంబర్ వన్ సంస్థ. పాలు పోస్తున్న అక్కచెల్లెమ్మలే అమూల్‌కు యజమానులు. ఇప్పటికే ప్రకాశం, వైఎస్సార్ కడప, చిత్తూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం కొనసాగుతోంది. కొత్తగా అనంతపురం జిల్లాలో ప్రారంభిస్తున్నాం. అనంతపురం జిల్లాకు ఇదొక మంచి శుభవార్త. పాడి రైతుకు లీటర్‌కు రూ. 5-20వరకు అదనపు ఆదాయం వస్తోంది. రాష్ట్రంలో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేస్తున్నాం. అమూల్ వచ్చిన తర్వాత ప్రైవేట్ కంపెనీలు రేటు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. పాల సేకరణలో జరిగే మోసాలపై ప్రత్యేక దృష్టి సారించాం' అని సీఎం జగన్ అన్నారు. వీరికి పౌష్టికాహారం రూపంలో గర్భిణీలకు 200 గ్రా. పాలతో పాటు పిల్లలకు రోజూ 100 గ్రా. పాలు, నెలకు 2.5 కేజీల చొప్పున బాలామృతం కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజే స్తోంది. ఇప్పటివరకు వీటిని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరు నుంచి నెలకోసారి టెట్రా ప్యాకింగ్ రూపంలో 1.07 కోట్ల లీటర్ల చొప్పున ఏటా 12.84 కోట్ల లీటర్ల పాలు, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సొసైటీ నుంచి ఏటా 48,692 మెట్రిక్ టన్నుల బాలామృతాన్ని అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్నారు.పాలు కోసం రూ.500 కోట్లు ఖర్చు చేస్తుండగా, బాలామృతం కోసం రూ.265 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. రాష్ట్రంలో మొత్తం 55,607 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిద్వారా ఆర్నెల్ల నుంచి మూడేళ్లలోపు ఉన్న చిన్నారులు 22.50 లక్షల మంది.. గర్భిణీ స్త్రీలు 7.50 లక్షల మంది ఉన్నారు. రాష్ట్రంలో మన పాడి నుంచి ఉత్పత్తి అయ్యే తాజా పాలతో పాటు రాష్ట్ర పరిధిలోనే ప్రాసెస్ చేసిన బాలామృతాన్ని అంగన్‌వాడీలకు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీనివల్ల మన పాడి రైతులకు మేలు జరగడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఈ రెండు ప్రాజెక్టులు చేపట్టేందుకు ముందుకొచ్చిన అమూల్ సంస్థతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది.

# చర్చల కోసం ఎదురు చూస్తున్నాం



వారు వస్తేనే చర్చించడానికి లేదు
ప్రభుత్వం తీరును అలుసుగా తీసుకోరాదు
ఉద్యోగ సంఘాలకు మంత్రి బొత్స సూచన
చర్చలు జరిపితేను సమస్యకు పరిష్కారం అన్న సజ్జల

అమరావతి,జనవరి28(ఆర్ఎన్ఎ): చర్చలుజరిపేందుకు తాము సిద్దంగా ఉన్నామని,ఉద్యోగుల పిలుపు కోసం ఎదురు చూస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పిఆర్‌సి సాధన సమితి తీరుపై మంత్రి బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఏ ఒక్కరికి రూపాయి కూడా తగ్గేది లేదని, చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య ఘర్షణ వాతావరణం వద్దని సలహా ఇచ్చారు. తాము నాలుగు మెట్టు దిగడానికి సిద్ధంగా ఉన్నామని, దాన్ని ఉద్యోగులు అలుసుగా తీసుకోవద్దని హెచ్చరించారు. ఇకపై చర్చల కోసం సంప్రదింపుల కమిటీ ఎదురు చూపులు ఉండవని, ఉద్యోగ సంఘాలు ముందుకు వస్తేనే చర్చలు జరుపుతామన్నారు. ఉద్యోగులను చర్చలకు పిలిచినా పీఆర్‌సీ సాధన కమిటీ వాళ్లు చర్చలకు రాకపోవడం బాధాకరమని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఉద్యోగులు రాజకీయ ఆలోచన చేస్తున్నారా అని ప్రశ్నించారు. జీతాలు పడితే కదా.. పెరిగేది, తగ్గేది తెలిసేదని, ఎవరికీ కూడా రూపాయి కూడా తగ్గదని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాల నేతలను మంత్రుల కమిటీ శుక్రవారం మరోసారి సమావేశానికి ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ..రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల కోసమే కమిటీ వేశామని, ఉద్యోగుల్లో అపోహలు తొలగించేందకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులతో చర్చలకు తాము అందుబాటులో ఉన్నామని మరోసారి స్పష్టం చేశారు. ఘర్షణ వాతావరణం మంచిది కాదని, వాళ్ళు ఎప్పుడు చర్చకు వస్తామంటే అప్పుడే చర్చిస్తామని తెలిపారు. చర్చల వల్లే సమస్య పరిష్కారం అవుతుందని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పీఆర్సీపై ఈరోజు కూడా ఉద్యోగులతో చర్చలకు వచ్చామని ఆయన తెలిపారు. ఇవాళ కొన్ని సంఘాలు చర్చలకు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఘర్షణకు దారి తీయకూడదనే కమిటీ ఏర్పాటు చేశామన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు రాలేదన్నారు. వేరే సంఘం నాయకులు వచ్చి మాట్లాడారని ఆయన తెలిపారు. చర్చల వల్లే సమస్య పరిష్కారం అవుతుందని, లేకపోతే లేని పోనీ అపోహాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే మూడు రోజులు ఆలస్యం అయిందన్నారు.

# దేశం పట్ల బాధ్యతల నిర్వహణలో NCC శిక్షణ ఉపయోగపడుతోంది : మోదీ



న్యూఢిల్లీ : దేశం పట్ల తన బాధ్యతలను నిర్వర్తించేందుకు అమితమైన బలం తనకు చీజజలో పొందిన శిక్షణ వల్ల లభిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలోని కరియప్ప మైదానంలో జరిగిన చీజజ ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చీజజ గణతంత్ర దినోత్సవాల శిబిరం ముగింపు సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 28న ఈ ర్యాలీ జరుగుతుంది. మోదీ మాట్లాడుతూ, "మీలాగే నేను కూడా ఒకప్పుడు చురుకైన చీజజ కేడెట్‌నని చెప్పడం గర్వంగా ఉంది. చీజజలో నేను పొందిన శిక్షణ, నేర్చుకున్న విషయాలు, దేశం పట్ల నా బాధ్యతలను నిర్వర్తించడంలో నేడు నేను అద్భుతమైన శక్తిని పొందుతున్నానువవ అన్నారు. స్వాతంత్రం లభించి 75 ఏళ్ళు అవుతున్న సందర్భంగా అమృత మహోత్సవాలను దేశం జరుపుకుంటోందన్నారు. అటువంటి సమయంలో జరుగుతున్న ఈ సంబరాలు చాలా ప్రత్యేకమైనవని తెలిపారు. కరియప్ప మైదానంలో తాను అటువంటి ఉత్తేజాన్ని చూస్తున్నానని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ NCC (నేషనల్ కేడెట్ కాప్స్) ర్యాలీలో సిక్కు కేడెట్ తలపాగాను ధరించారు. ఎర్రని ఈకలతో అలంకరించిన రైఫిల్-గ్రీన్ తలపాగాను ధరించారు. కేడెట్ల కవాతును సమీక్షించి, గార్డ్ ఆఫ్ ఆనర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉత్తమ కేడెట్లకు పతకాలు, బ్యాటన్లను బహూకరించారు. స్వాతంత్ర్య దినోత్సవాలు, గణతంత్ర దినోత్సవాల్లో ప్రధాని మోదీ ధరించే తలపాగాలు గొప్పగా ప్రచారమవు తున్నాయి. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాల్లో ఉత్తరాఖండ్ సంప్రదాయ తలపాగాను ధరించారు. ఆ రాష్ట్ర పుష్పం బ్రహ్మకమలం చిత్రంతో కూడిన ఈ తలపాగా ఆకర్షణీయంగా కనిపించింది. అదేవిధంగా మణిపూర్‌లో ప్రసిద్ధమైన అంగ వస్త్రన్ని కూడా ధరించారు. ఈ రెండు రా(ష్టాల్లోనూ శాసన సభ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే.

# పీఆర్సీ జీవోలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ



అమరావతి: పీఆర్సీ అమలుకు ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. ఈ మేరకు ప్రభుత్వ తరపు న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఈ పిటిషన్ డివిజన్ బెంచ్ ముందు విచారించాలని, ఇది సింగిల్ బెంచ్ కాబట్టి ను ఇక్కడ విచారించకూడదని అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ హైకోర్టుకు తెలిపారు. శ్రీరామ్ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం రిట్ పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తదుపరి చర్యలు తీసుకోవడానికి పంపాలని రిజిస్ట్రర్‌ను ఆదేశించింది. అదే విధంగా అభివృద్ధి వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ రద్దు, అమరావతి పిటిషన్లపై ఏపీ హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు వాదనలు ముగిసిన అనంతరం ఫిబ్రవరి 2న ప్రభుత్వం, సీఆర్‌డీఏ తరపున వాదనలు వినిపించాలని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ ఫిబ్రవరి2కు వాయిదా వేసింది.

# అవసరమైతే మెరుపు సమ్మె: విద్యుత్ ఉద్యోగులు

అమరావతి: నోటీసులు తీసుకున్న తర్వాత కక్ష సాధింపు చర్యలు చేపడితే మెరుపు సమ్మెకు దిగుతామంటూ విద్యుత్ ఉద్యోగులు హెచ్చరికలు జారీ చేశారు. విద్యుత్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ ఇంధనశాఖ కార్యదర్శికి విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నోటీసులు ఇచ్చింది. కృష్ణపట్నం థర్మల్ పవర్ స్టేషన్ ప్రైవేటీకరణకు నిరసనగా ఆందోళన చేసింది. సమస్యల పరిష్కారం కోసం మంత్రి సమక్షంలో జరిగిన ఒప్పందాన్ని ఉల్లంఘించడంపై జేఏసీ సీరియస్ అయింది. యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు దిగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. నోటీసులు తీసుకున్న తర్వాత కక్ష సాధింపు చర్యలు చేపడితే మెరుపు సమ్మెకు దిగుతామంటూ హెచ్చరించింది.

# ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ : షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు రిజర్వేషన్ల కోసం నిబంధనలను బలహీనపరచబోమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీని కోసం కొత్త కొలమానాన్ని విధించజాలమని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యం తక్కువగా ఉందా? అనే అంశంపై సమాచారాన్ని సేకరించవలసిన బాధ్యత రాష్ట్రాలదేనని తెలిపింది. జస్టిస్ నాగేశ్వర రావు నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో రిజర్వేషన్ల మంజూరుకు ముందు గణాంకాలతో కూడిన సమాచారాన్ని సేకరించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని తెలిపింది.



సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు నేపథ్యంలో తాము కొత్తగా ఓ కొలమానాన్ని విధించడం సాధ్యం కాదని తెలిపింది. ప్రభుత్వోద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించవలసిన బాధ్యత రాష్ట్రాలదేనని తెలిపింది. రిజర్వేషన్లపై సమాచారాన్ని కేడర్ బేస్డ్ వేకెన్సీల ప్రాతిపదికపై సేకరించాలని చెప్పింది. రిజర్వేషన్ల కల్పన కోసం రాష్ట్రాలు సమీక్షను నిర్వహించాలని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం అంతకుముందు వాదనలు వినిపిస్తూ, భారత దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు అవుతున్నప్పటికీ, ప్రతిభ విషయంలో అగ్ర వర్ణాల స్థాయికి ఎస్సీ, ఎస్టీలు రాలేదని తెలిపింది. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వోద్యోగాల్లో పదోన్నతుల్లో రిజర్వేషన్ల మంజూరుపై తీర్పును సుప్రీంకోర్టు అక్టోబరు 26న రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. 133 పిటిషన్లపై వాదనలను విన్న తర్వాత శుక్రవారం ఈ తీర్పును ఇచ్చింది.

# మూడు రాజధానులపై హైకోర్టు విచారణ

కొత్త జిల్లాల లాగే మూడు రాజధానులు తప్పవు
విశాఖ ఎగ్జిక్యూటివ్ రాజధాని అంటూ అవంతి పునరుద్ఘాటన



అమరావతి/విశాఖపట్టణం,జనవరి28(: రాష్ట్రానికి మూడు రాజధానుల పిటిషన్లపై హైకోర్టులో మరోమారు విచారణ జరిగింది. మూడు రాజధానుల బిల్లులను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రభుత్వం చట్టాలను ఉపసంహరించుకున్నా మళ్లీ ప్రవేశ పెడతామని పేర్కొనడంతో విచారణ కొనసాగించాలని న్యాయవాదులు కోరారు. పిటీషన్లలో ఏ అంశాలపై విచారణ కొనసాగించాలో అఫిడవిట్‌లు దాఖలు చేయాలని గతంలో త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. అఫిడవిట్‌లు దాఖలు చేసి వాదనలను న్యాయవాదులు వినిపించారు. ఏపీలో మళ్ళీ మూడురాజధానుల అంశం తెరమీదకు వచ్చింది. తాజాగా మంత్రి అవంతి శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల హామీకి అనుగుణంగా రాష్ట్రంలో 26జిల్లాలు ఏవిధంగా వచ్చాయో..మూడు రాజధానులు అదే విధంగా వస్తాయన్నారు. విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ రాజధానిగా అవ్వడం ఖాయం అని ధీమాగా చెప్పారు. చంద్రబాబు ఎప్పుడు ఊహాలు, అయోమయంలో ఉంటారని ఎద్దేవా చేశారు. కొత్త జిల్లాలకు టీడీపీ అనుకులమో..వ్యతిరేకమో చెప్పాల న్నారు.

# సంపాదకీయం

శనివారం 29 జనవరి 2022

## ఇక జమిలీ ఎన్నికల అడుగులేనా

వన్ నేషన్-వన్ ఎలక్షన్ తో పాటు వన్ నేషన్-వన్ వోటర్ లిస్ట్ అంటూ రెండు నినాదాలను బీజేపీ కార్యకర్తలకు అందించారు. స్థానిక ఓటర్ల గుర్తింపు, వారితో సంపర్కం, బీజేపీకి ఓటు వేసేలా మోటివేట్ చేయడం... ఇలా గ్రౌండ్ లెవెల్లో కీలకమైన పాత్ర పోషించే పన్నా ప్రముఖ్ లతో మోడీ ఇంటరాక్ట్ అయ్యారు. లోకల్ వోటర్ లిస్టులో ఒక్కో పేజీకి ఒక్కో ఇంచార్జ్ని బీజేపీవారు ఈపాటికే నియమించుకున్నారు. ఆ పేజీలో ఉండే ఓటర్లను కలవడం, వారితో స్నేహం పెంచుకోవడం, బీజేపీకి ఓటు వేసేలా వారిని మోటివేట్ చేయడం... వారిద్వారా మరింత మంది ఓటర్లను ప్రభావితం చేసేందుకు వారిని సోషల్ మీడియాలో కూడా యాక్టివేట్ చేయడం... ఇదీ పన్నా ప్రముఖ్ ల పని. మరి లోకల్ లెవెల్లో పనిచేసే పన్నా ప్రముఖ్ లకు జాతీయ సబ్జెక్టయిన వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశాన్ని ఎందుకు వినిపించారు? ఇక్కడే ఉంది అసలైన కిటుకు. బీజేపీని ప్రజలంతా జాతీయపార్టీగా ఆదరిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే జాతీయ పార్టీగా మాత్రమే చూస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ అంశాల్లో మోడీకి మరో ప్రత్యామ్నాయం లేదని సామాన్య ఓటర్లు సైతం చెబుతున్న మాట. అక్కడివరకు బానే ఉంది. ఎటొచ్చీ రాష్ట్రాల అసెంబ్లీల్లోనే బీజేపీ నెంబర్ పెద్దగా వర్కవుట్ అవడం లేదు. రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు ఉంటేనే ఎమ్మెల్సీల సంఖ్య పెరుగుతుంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోనే రాజ్యసభ సభ్యుల కేటాయింపు జరుగుతుంది. రాజ్యసభలో తగినంత బలం ఉంటేనే ఏ బిల్లయినా పాస్ అవుతుంది. లేకపోతే బీజేపీ నాయకులు అనుకున్న బిల్లులేవీ ఆమోదం పొందవు. ఇప్పుడు కూడా బీజేపీకి రాజ్యసభలో తగినంత బలం లేదు. అందుకే రాష్ట్రాల అసెంబ్లీల మీద బీజేపీ హైకమాండ్ కన్నేసింది. ప్రజల్ని బీజేపీ వైపు మొగ్గు చూపేలా చేయాలంటే స్థానిక పన్నా ప్రముఖ్ లే ఎంతో కీలకం. వారి ద్వారానే వన్ నేషన్-వన్ ఓటర్ లిస్ట్ కోసం ఓటర్లను సమాయత్తం చేసి వన్ నేషన్-వన్ ఎలక్షన్ దిశగా మోటివేట్ చేయడమే అసలైన ఉద్దేశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.దేశమంతా గర్వించే 370 ఆర్టికల్ రద్దు నిర్ణయంతో బీజేపీ కీర్తి విపరీతంగా పెరిగిపోయింది. సామాన్య జనానికి బాగా కనెక్ట్ అయింది. అటు రాంమందిర్ ఇష్యూను కూడా ఎలాంటి ఉద్రిక్తతలకు తావు లేకుండా కోర్టు ద్వారా పరిష్కారం దొరకడానికి ఎంతో సక్సెస్ ఫుల్ గా కృషి చేశారు. ఇన్ని పాజిటివ్ అంశాలున్నప్పుడు ప్రజల్ని ఆయా రాష్ట్రాల్లో కూడా తమకే ఓటు వేసేలా ఎందుకు చేయరాదన్నదే మోడీ జమిలి కామెంట్లలోని పరమార్థంగా చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికలతో పాటే రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరిగితే ఎంపీ అభ్యర్థులతో పాటు స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులను కూడా తమవారినే చట్టసభల్లోకి ప్రజలు పంపిస్తారని మోడీ-షా ద్వయం ఆలోచిస్తున్నారు. అందుకే గత కొంతకాలంగా జమిలి అంశాన్ని ముందుకు తెస్తున్నారు. అదే జరిగితే బీజేపీ ప్రాభవం విపరీతంగా పెరుగుతుందని, ఆ హవాను తట్టుకోవడం ప్రాంతీయ పార్టీలకు అయ్యే పని కాదన్న అభిప్రాయాలున్నాయి. క్రితంసారి ఎన్నికల్లో కేసీఆర్ దాదాపు ఏడాది కాలాన్ని కోల్పోయి తెలంగాణను ముందస్తు ఎన్నికల్లోకి దించడానికి ఇదే భయం కారణమన్న వ్యాఖ్యానాలున్నాయి. అప్పుడు జమిలి కాకపోయినా.. కేసీఆర్ ముందస్తుకు వెళ్లారంటే ఇక జమిలి గనక ఖాయమైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. బీజేపీయేతర పార్టీలకు పట్టుకున్న భయం కూడా ఇదేనంటున్నారు విశ్లేషకులు. మరి జమిలి అనగానే సరిపోతుందా.. అది అంత సులభమా? అంటే కానే కాదు. దేశానికి స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో జమిలిగానే ఎన్నికలు జరిగాయి. ఖర్చులు తగ్గడానికి, అభివృద్ధి పనులు ఆగకుండా ఉండడానికి ఇప్పుడు కూడా అదే మంచిదన్న అభిప్రాయాలున్నా.. ఆచరణలో అందుకు ఇబ్బందికరంగా మారిన అంశాలెన్నో ఉన్నాయి. వివిధ రాష్ట్రాలకుండే పాలనాకాలం వేర్వేరుగా ఉండడం దగ్గర నుంచి ఒకవేళ దేశమంతా జమిలికి వెళ్లి రాష్ట్రాల అసెంబ్లీలు, కేంద్ర ప్రభుత్వం ఒకేసారి కొలువుదీరినా ఏదైనా రాష్ట్రంలో ఏదైనా కారణం చేత ప్రభుత్వం బర్తరఫ్ అయితేనో, రాష్ట్రపతి పాలన వస్తేనో మళ్లీ ఎలక్షన్ కు వెళ్లాల్సి ఉంటుంది. మరి అలాంటప్పుడు జమిలి ఏ విధంగా సక్సెస్ అవుతుందన్నది ఓ ముఖ్యాంశం. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంది. రాజ్యాంగంలోని 352, 356, 360 ఆర్టికల్స్ ద్వారా విచక్షణాధికారాలు కేంద్రానికి సంక్రమించాయి. అలాంటివాటిని ముందుగా సవరించాల్సి ఉంటుంది. అదే జరిగితే రాష్ట్రాలకుండే ఫెడరల్ పవర్స్ కూడా ఎంతో కొంత దెబ్బ తింటాయన్న అభిప్రాయాలు కూడా లేకపోలేదు. మరి ఈ పరిస్థితుల్లో తేనెతుట్టె లాంటి అంశాన్ని మోడీ కదిలిస్తే ఎలాంటి రియాక్షన్స్ వస్తాయి.. అవి ఏ మేరకు మంచి ఫలితాలిస్తాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. అందుకే మోడీ తెలివిగా జమిలి మీద విస్తృతంగా చర్చించాలంటూ జనాన్నినెమ్మదిగా ఆ వైపు ఆలోచింపజేస్తున్నారని, అలా సమయం చూసుకొని జమిలిని ప్రకటించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయాలున్నాయి. మరి మోడీ ఏం చేస్తారో ప్రస్తుతం ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయ్యాక ఏం జరుగుతుందో చూడాల్సి ఉంది.

# బాబు హస్తిన టూర్...?




గుంటూరు, జనవరి 28, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు బీజేపీ అవసరం చాలా ఉంది. భవిష్యత్ లో పార్టీ మనుగడ సాధించాలన్నా, 2024 ఎన్నికల్లో ఆయన విజయం సాధించాలన్నా కమలం పార్టీతో చేతులు కలపడం అవసరం. ఇటీవల ఇండియా టుడే మూడ్ ఆఫ ది నేషన్ సర్వేలోనూ బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని తేలింది. దీంతో పాటు విపక్షాలు కూడా బీజేపీకి వ్యతిరేకంగా నిలబడలేని పరిస్థితి దేశంలోనూ ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నాటికి బీజేపీతో చేతులు కలపాలన్న ప్రయత్నంలో చంద్రబాబు ఉన్నారు. అధికారంలో ఉన్న జగన్ ను ఎదుర్కొనాలంటే చంద్రబాబుకు బీజేపీ అండ అవసరం. నెలన్నర క్రితం చంద్రబాబు ఢిల్లీ వెళ్లినా బీజేపీ పెద్దల అపాయింట్ మెంట్ లభించలేదు. దీంతో రాష్ట్రపతిని కలిసి వెనక్కు వచ్చేశారు. టీడీపీ కార్యాలయాలపై వైసీపీ నేతలు దాడి జరిగినా ఎటువంటి కేసులు పెట్టలేదని, రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదని, రాష్ట్రపతి పాలన పెట్టాలని చంద్రబాబు డిమాండ్ చేసూ వస్తున్నారు. అయితే ఇప్పుడిప్పుడే ఆయనకు బీజేపీ డోర్స్ తెరుచుకుంటున్నట్లు కన్పిస్తున్నాయి. బీజేపీలో తెలుగుదేశం పార్టీని కాదంటున్న వర్గాన్ని ఆ పార్టీ అధినాయకత్వం కొంత పక్కన పెట్టింది. సోము వీర్రాజు బ్యాచ్ ఇటీవల కాలంలో కొంత కంట్రోల్ అయింది. రాష్ట్ర బీజేపీ కూడా అధికార వైసీపీపై మాటల దాడిని ప్రారంభించింది. వరసగా తమ పార్టీ నేతలపై అక్రమంగా కేసులు నమోదవుతుండటం, ఆర్థిక మూలాలను దెబ్బతీస్తుండటంతో చంద్రబాబు మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లాలని భావిస్తున్నారు.. ఈసారి పక్కాగా అపాయింట్ మెంట్ తీసుకుని ఆయన ఢిల్లీకి వెళ్లనున్నారని అంటున్నారు. డీజీపీని రీ కాల్ చేయాలని కోరడం, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను బీజేపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానుండటంతో ఆ సమయంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా అందుబాటులో ఉంటారని భావిస్తున్నారు. అదే సమయంలో చంద్రబాబు తన ఢిల్లీ టూర్ ను ప్లాన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరి ఈసారైనా బీజేపీ పెద్దల అపాయింట్ మెంట్ చంద్రబాబుకు లభిస్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# కోస్తా జిల్లాగా మారిపోయిన తిరుపతి

విజయవాడ, జనవరి 28, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్లోని వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో రాష్ట్ర స్వరూపమే మారిపోయింది. ఇప్పటి వరకు నీటి ఎద్దడి ప్రాంతంగా పేరొందిన రాయలసీమ.. ఇప్పుడు సముద్ర తీర ప్రాంతం కలిగిన సీమ గా మారిపోయింది. అవును.. జిల్లాల పునర్వ్యవస్థీకరణ, కొత్త జిల్లాల ఏర్పాటులో భౌగోళికంగా పెను మార్పు చోటుచేసుకోనుంది. ఇప్పటి వరకూ శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న కోస్తా జిల్లాలకు మాత్రమే తీర ప్రాంతం ఉండేది. రాయలసీమకు చెందిన నాలుగు జిల్లాలకు భౌగోళికంగా సముద్ర తీర ప్రాంతం లేదు. కానీ, ఇప్పుడు సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని తిరుపతి బాలాజీ జిల్లాలో కలపడంతో.. తిరుపతి జిల్లా కోస్తా జిల్లాగా మారిపోయింది.ఆంధ్రప్రదేశ్లో ఇప్పటివరకూ కోస్తా జిల్లాలు 9, రాయలసీమ జిల్లాలు 4 కలిసి మొత్తం 13 జిల్లాలు ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న జిల్లాల పునర్వ్యవస్థీకరణ నిర్ణయంతో రాష్ట్ర భౌగోళిక స్వరూపమే మారిపోయింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో కోస్తా సముద్ర తీర ప్రాంతం కలిగిన జిల్లాలు 12 కాగా, తీర ప్రాంతం లేని జిల్లాలు 14 అయ్యాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో తిరుపతి కోస్తా జిల్లాగా మారిపోవడమే అన్నిటికంటే పెద్ద విషేషంగా చెప్పవచ్చు. నెల్లూరు జిల్లాకు చెందిన తీర ప్రాంత అసెంబ్లీ నియోజకవర్గాలు సూళ్లూరుపేట, గూడూరులను తిరుపతి జిల్లాలో కలపడమే దీనికి కారణం. నెల్లూరు జిల్లాకు చెందిన ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలూ తిరుపతి పార్లమెంటు పరిధిలో ఉండటం వల్లే వీటిని ఆ జిల్లాల్లో కలిపారు.ఇంతకు ముందు నాలుగు జిల్లాలు కలిగిన రాయలసీమ ప్రాంతం ఇప్పుడు ఎనిమిది జిల్లాలుగా మారింది. అవి నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి(పుట్టపర్తి), వైఎస్సార్ కడప, అన్నమయ్య (రాయచోటి), చిత్తూరు, శ్రీబాలాజీ (తిరుపతి) జిల్లాలు. అయితే ఇందులోని తిరుపతిని కోస్తా జిల్లాగా లెక్క వేయాలా? లేక తీరప్రాంతం కలిగిన రాయలసీమ జిల్లాగానే లెక్కవేస్తారా చూడాలి.శ్రీ బాలాజీ (తిరుపతి) జిల్లా పూర్తి వివరాలు.. హెడ్ క్వార్టర్ : తిరుపతి రెవెన్యూ డివిజన్లు : తిరుపతి, గూడూరు, నాయుడుపేట మండలాలు-35 : తిరుపతిలోకి 11 మండలాలు, గూడూరుకి 11 మండలాలు, నాయుడుపేటకు 13 మండలాలు వచ్చాయి. నెల్లూరు జిల్లా ఆత్మకూరు పరిధిలోని కాలువలోయ, నెల్లూరు డివిజన్ పరిధిలోని రావూరు మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్లో కలిపారు. అలాగే, నెల్లూరు జిల్లాకు చెందిన సూళ్లూరుపేట, ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు, దొరవానిసత్రం, తడ మండలాలను నాయుడుపేట డివిజన్లో కలిపారు. తిరుపతి డివిజన్ పరిధిలోని ఏడు మండలాలను కూడా నాయుడుపేట రెవెన్యూ డివిజన్లో కలిపారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, కేవీబీ పురం, సత్యవేడు, బీఎన్ కండ్రిగ, వరదయ్యపాలెం మండలాలను నాయుడుపేట డివిజన్లో కలిపారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలు: సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు విస్తీర్ణం : 9,176 చ.కి.మీ జనాభా: 22.18 లక్షలు.ఇదిలాఉంటే.. సుళ్లూరుపేటతో పాటు మైపాడ్ బీచ్ కూడా ఇప్పుడు శ్రీబాలాజీ జిల్లా కిందకు వస్తుంది. అంటే రాయలసీమకు కూడా ఇప్పుడు బీచ్లు అందుబాటులోకి వచ్చాయన్నమాట. ఇక పోర్టు కడితే.. రాయలసీమ పోర్టుగా ప్రసిద్ధికెక్కుతుందని కొంత మంది అప్పుడే విశ్లేషిస్తున్నారు. మొత్తంగా రాయలసీమకు ఎవరూ ఊహించని ఓ ప్రత్యేకత జిల్లాల విభజనతో వస్తోందని అనుకోవచ్చు. ఏదేమైనా రాయలసీమకు సముద్రం అనేదే ప్రస్తుతం హాట్ టాపిక్ గా ఉంది కడప కనుమరుగుఏపీలో ఇప్పుడు ఎక్కడ చూసినా కొత్త జిల్లాల ఏర్పాటుపైనే చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను విభజించిన తీరుపై కొందరు హర్షం వ్యక్తం చేయగా.. మరికొందరు మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రాలు, ప్రాంతాలను ఇతర జిల్లాల్లో కలపడంపై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. తమ జిల్లాలకు ఫలానా పేరు పెట్టాలని కూడా డిమాండ్లు వస్తున్నాయి. సీఎం జగన్ సొంత జిల్లా అయిన కడప పూర్తిగా కనుమరుగు అవ్వనుంది. ఈ జిల్లాను రెండు ముక్కలు చేయబోతోంది ప్రభుత్వం. రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లా, మరో భాగానికి వైఎస్సార్ జిల్లాగా నామకరణం చేసింది. మొన్నటి వరకూ కడప, ఆ తర్వాత వైఎస్సార్ కడప జిల్లాగా ఉన్న కడప.. కొత్త జిల్లాల విభజనతో తన ఉనికిని కోల్పోయి.. చరిత్రకే పరిమితం కానుంది. కడప అంటే తిరుమలకు తొలి గడపగా భావించే వెంకన్న భక్తులు.. కడప జిల్లాను రెండుగా విభజించడం, విభజనలోనూ జిల్లా పేరు లేకుండా చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

# టీడీపీకి మళ్లీ షాక్



విజయనగరం, జనవరి 28, (న్యూస్ పల్స్)లుగుదేశం పార్టీకి డబుల్ షాక్ ఇచ్చారు ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలు. టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకున్నారు. ఇవాళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు శోభా హైమావతి, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జడ్పీ చైర్మన్ చిన్ని శ్రీను కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన శ్రీను.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వాన్ని, ఆయన సంక్షేమ పాలన చూసి ఆకర్షితులై మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మాజీ పార్లమెంటు సభ్యులు డీవీజీ శంకరరావు కూడా పార్టీలో చేరారని అన్నారు. తమ ప్రాంతంలో అనేక సంక్షేమ, అబివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నందుకు వారు తమ పార్టీలో చేరారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయి అబివృద్ధి జగన్ సారథ్యంలోనే జరుగుతోందన్నారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళల పట్ల అవలంబిస్తున్న విధానాలు, వారి సంక్షేమం కోసం చేస్తున్న కృషికి ఆకర్షితురాలినయ్యానని పేర్కొన్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ ఇస్తూ గౌరవిస్తున్నారని ముఖ్యమంత్రి విధానాలను కొనియాడారు. అంతేకాకుండా 90 లక్షల మంది మహిళలకు ఆసరా ఇస్తున్నారని, కింది స్థాయిలో ఉన్న వారికి కూడా ఈ రోజు సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని అన్నారు. గతంలో ఒక్క ట్రైబల్ మినిస్టర్ కూడా లేరని, ఇప్పుడు ఒక ట్రైబల్ మహిళకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని, ఇది వైఎస్ జగన్కు మాత్రమే దక్కిన ఘనత అని పేర్కొన్నారు. తాము కోరుకుంటున్న పరిపాలన జగన్ అందిస్తున్నందున వైసీపీలో చేరామని అన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి కృషి చేస్తామని శోభా హైమావతి అన్నారు. ఆయన ఆప్యాయతతో కూడిన పలకరింపు తమకు చాలా ఆనందంగా ఉందన్నారు.డీవీజీ శంకరరావు మాట్లాడుతూ.. గతంలోనే విజయసాయిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరానని అన్నారు. అయితే, ఇవాళ ముఖ్యమంత్రి జగన్ను కలిశానని తెలిపారు. ట్రైబర్ ఏరియాలో విద్య, వైద్యం కోసం సీఎం కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఒక సామాన్యుడికి భరోసా వచ్చిందంటే.. అది ఒక్క జగన్మోహన్ రెడ్డి వల్లే సాధ్యం అని అన్నారు

# టైపింగ్ మిస్టేక్...

విజయవాడ, జనవరి 28, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అశోక్ బాబుపై సీఐడీ కేసు నమోదయింది. ఆయన బికాం చదివినట్లు దొంగ సర్టిఫికేట్లు ఇచ్చారన్న ఆరోపణలు వచ్చాయి. ఆయనపై లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో దాని సూచన మేరకు ఏపీ సీఐడీ పోలీసులు అశోక్ బాబు పై కేసు నమోదు చేశారు. అశోక్ బాబు అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ గా పనిచేశారు. ఆ సమయంలో తన సర్వీస్ రికార్డుల్లో విద్యార్హతలను తప్పుడుగా పేర్కొన్నారు. దీంతో సీఐడీ పోలీసులు అశోక్ బాబుపై 477ం, 465, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అశోక్ బాబు గతంలో ఏపీ ఎన్జీవో అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆయన సమైక్యాంధ్ర ఉద్యమంలోనే హైలెట్ అయ్యారు. కొత్తగా రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అశోక్ బాబు తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ఆయనకు ఎమ్మెల్సీ పదవి కూడా ఇచ్చింది. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలయిన తర్వాత అశోక్ బాబు ఆ పార్టీ గొంతుకగా మారారు. అందువల్లనే పాత కేసులను తిరగదోడుతున్నారని అశోక్ బాబు చెబుతున్నారు. ఇది పాత కేసుగా అశోక్ బాబు కొట్టి పారేస్తున్నారు. గతంలోనే తనపై ఇలాంటి ఆరోపణలు చేశారని, అవన్నీ కొట్టి పారేశారని అశోక్ బాబు చెబుతున్నారు. టైపో గ్రాఫిక్ మిస్టేక్ వల్ల డి.కామ్ అన్న స్థానంలో బికామ్ అని పడిందని, దీన్ని సాకుగా చూపి తనపై శాఖాపరమైన విచారణ కూడా గతంలో చేశారన్నారు

# ఎందుకు ఇలా... అవుతోంది

విజయవాడ, జనవరి 28, (న్యూస్ పల్స్)జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా ఏపీ ఎందుకో రగిలిపోతుంది. ఒకవర్గం మీడియా ఏపీ అట్టుడికిపోతుందంటూ కలరింగ్ ఇస్తుంది. కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇది కొత్తగా చెప్పింది కాదు. జగన్ 2019కి ముందే తన పాదయాత్రలో జిల్లాల పెంపుపై హామీ ఇచ్చారు. ప్రతి పార్లమెంటు కేంద్రాన్ని జిల్లాను చేస్తానని చెప్పారు. చెప్పినట్లే ఇప్పుడు నోటిఫికేషన్ ను విడుదల చేశారు. అయితే చంద్రబాబు దాని అనుకూల మీడియాకు మాత్రం ఇది మింగుడు పడటం లేదు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏపీ రగిలిపోతుందంటూ డిబేట్ల మీద డిబేట్లు నడుపుతున్నాయి. .. ఇరవై ఆరు జిల్లాలు ఏర్పాటు చేస్తే అక్కడకక్కడా అభ్యంతరాలు వెలువడటం సహజమే. ప్రధానంగా మదనపల్లెలో కొంత వ్యతిరేకత కన్పిస్తుండటమూ వాస్తవమే. కానీ మరే జిల్లాల్లో ఇంత పెద్దగా వ్యతిరేకత కన్పించడం లేదు. ఇంత హడావిడిగా చేయాల్సిన అవసరం ఏంటన్నది చంద్రబాబు వేస్తున్న ప్రశ్న. ప్రజల దృష్టిని మళ్లించడానికే కొత్త జిల్లాల ఏర్పాటును తెరపైకి తీసుకు వచ్చారన్న ప్రచారం చేస్తున్నారు. జిల్లాలను ఏర్పాటు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆందోళనను విరమిస్తారా? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరుగునపడిపోతాయా? బాబు ఎందుకు చేయలేకపోయారు? మరోవైపు తెలుగుదేశం పార్టీలోనే కొత్త జిల్లాల ఏర్పాటుపై సానుకూల ధోరణి వినిపిస్తుంది. తమ నాయకుడు చేయలేని పని చేశారని అంతర్గత సంభాషణల్లో వ్యక్తమవుతుంది. చంద్రబాబు 2014లో అధికారంలోకి రాగానే జిల్లాల పెంపు ప్రతిపాదన వచ్చినా దానిని పక్కన పెట్టారు. లేని పోని సమస్యలు తెచ్చుకోవడం ఎందుకని ఆయన దాని జోలికి పోలేదు. కొత్త జిల్లాల ఏర్పాటుపై పెద్దగా కసరత్తు జరగలేదని, ఎవరితో చర్చించకుండానే నిర్ణయాలు తీసుకున్నారని చంద్రబాబు ఆరోపిస్తున్నారు. కొత్త జిల్లాలపై అభ్యంతరాలుంటే ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించడానికి నెల సమయం ఇచ్చారు. అందరినీ సంప్రదించారా? రాజధాని అమరావతి ఏర్పాటు విషయంలో అప్పటి ప్రతిపక్షంతో చంద్రబాబు చర్చించారా? అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకదు. ఏదైనా ఒక పెద్ద నిర్ణయం తీసుకున్నప్పుడు అక్కడక్కడ వ్యతిరేకత కన్పించడం సహజమే. అందుకే జగన్ ఆ ప్రాంతం వారికి ఊరట కల్గించేందుకు పదిహేను రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేశారు. ఏపీ అల్లకల్లోలంగా మారిందన్న అనుకూల మీడియా ప్రచారం కేవలం టీవీలకే పరిమితమవుతాయి. క్షేత్రస్థాయిలో అంత సీన్ లేదన్నది ఏపీలో ఉన్న వారికి అర్థమవుతుంది. అనేక జిల్లాల డిమాండ్లు వస్తాయి. వాటన్నింటిని ప్రభుత్వం నెరవేర్చలేదు. శాస్త్రీయంగా పరిపాలన సౌలభ్యం కోసమే జిల్లాలను ఏర్పాటు చేస్తారన్న విషయాన్ని విస్మరించి టీడీపీ అనుకూల మీడియా రచ్చ రచ్చ చేస్తుంది.

# ఏపీలో స్కూళ్లకు సెలవులు ఉండవు

విజయవాడ, జనవరి 28, (న్యూస్ పల్స్)కరోనా కట్టడిపై సీఎం జగన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తి పరిస్థితులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కేసులు నమోదు అవుతున్నా ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం ఉన్నవారి సంఖ్య చాలా స్వల్పంగా ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. ఆస్పత్రుల్లో చేరుతున్నవారు కూడా దాదాపు చికిత్సతో కోలుకుంటున్నారని వివరించారు. క్రమంగా పాజిటివిటీ రేటు కూడా తగ్గుముఖం పడుతున్నాయని సంకేతాలు కనిపిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు 1.06లక్షలకుపైగా కేసుల్లో కేవలం 2709 మందే ఆస్పత్రుల్లో చేరారని అధికారులు వెల్లడించారు. ఇందులో ఐసీయూలో చేరిన వారు కేవలం 287 మంది మాత్రమేనని తెలిపారు. 18 ఏళ్ల పైబడ్డ 90.34 శాతం మందికి రెండు డోసుల వాక్సినేషన్ పూర్తయ్యిందన్న అధికారులు సీఎంకు వివరించారు. అన్నిజిల్లాల్లో పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. కోవిడ్ కేర్ సెంటర్లలో ఉన్నవారికి మంచి సదుపాయాలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఆస్పత్రుల్లో చేరుతున్నవారికి అర్హులైన వారు అందరికీ కూడా ఆరోగ్యశ్రీ కింద చికిత్స పూర్తిస్థాయిలో అందిచాలన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ అమలు తీరు దేశం మొత్తం మాట్లాడుకునేలా ఉండాలని సూచించారు. కోవిడ్ చికిత్సలో భాగంగా అనుసరించాల్సిన విధానాలపై ఎప్పటికప్పుడు అడ్వైజరీస్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బీమా సంస్థలు రేట్లకన్నా.. ఆరోగ్యశ్రీ కింద చికిత్సలకు మంచి రేట్లు చెల్లిస్తున్నామని సీఎం చెప్పారు.రాష్ట్రంలోని ఏ పాఠశాలనూ మూసివేసేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. టీచర్ల సంఖ్యను కుదించేది లేదని.. అంగన్ వాడీ కేంద్రాలను తగ్గించేది లేదని వెల్లడించింది. అంగన్ వాడీ టీచర్లు, వర్కర్ల సంఖ్య తగ్గించేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా జాతీయ విద్యా విధానం అమలు చేయాలని జగన్ సర్కార్ నిర్ణయించింది.

# కొత్త పీఆర్సీతోనే జీతాలు

విజయవాడ, జనవరి 28, (న్యూస్ పల్స్)ఒక పక్కన కొత్త పీఆర్సీ వద్దు.. పాత పీఆర్సీ ప్రకారమే జీతాలు ఇవ్వాలంటున్నాయి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు.. వారికి ట్రెజరీ సిబ్బంది కూడా మద్దతుగా నిలిచారు. ట్రెజరీ ఉద్యోగులు కూడా పీఆర్సీ ఉద్యమంలో భాగం అయ్యారు. కొత్త పీఆర్సీ ప్రకారమే జీతాలు, పెన్షన్ బిల్లులు ప్రాసెస్ చేయాలని జగమొండి జగన్ సర్కార్ ట్రెజరీ సిబ్బందిపై తీవ్రంగా ఒత్తిడి పెంచుతోంది. రివైజ్ డ్ పేస్కేల్ కు సంబంధించిన ప్రక్రియను ట్రెజరీ సిబ్బంది ప్రారంభించ లేదు. ఈ నేపథ్యంలో భారత గణతంత్ర దినోత్సవం నాడు సెలవు రోజైనా రాష్ట్ర ఆర్థికశాఖ ఓ సరికొత్త సర్క్యులర్ జారీ చేయడం కలకలం రేపుతోంది. ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ సర్క్యులర్ విడుదల చేశారు.ప్రభుత్వ ఉద్యోగులకు జనవరి నెల వేతనాలు, పెన్షన్ బిల్లులను రివైజ్డ్ పే స్కేల్ 2022ను అనుసరించి ప్రాసెస్ చేయాలంటూ ఆ సర్క్యులర్ లో ట్రెజరీ ఉద్యోగులను ఆయన ఆదేశించారు. రివైజ్డ్ పే స్కేల్ ప్రకారం బిల్లుల ప్రక్రియ నిర్వహించకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కూడా ఆ సర్క్యులర్ లో ఎస్ ఎస్ రావత్ హెచ్చరించడం గమనార్హం. చెప్పిన పని చేయకపోతే డీడీఓలు, పీఏఓలు, ట్రెజరీ అధికారులపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఫిబ్రవరి 1వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు జమఅయ్యేలాచర్యలు చేపట్టాలని ట్రెజరీ అధికారులకు ఆర్థిక శాఖ సూచించింది.గత కొన్ని నెలలుగా వైసీపీ సర్కార్ ఉద్యోగులకు ప్రతి నెలా ఠంచన్ గా ఫస్ట్ తారీఖునే జీతాలు ఇవ్వడం లేదనేది ఇక్కడ ప్రస్తావించదగ్గ అంశం. కొత్త పీఆర్సీ వద్దు, పాత పీఆర్సీ ప్రకారమేతమకుజీతాలు ఇవ్వాలని పట్టుబట్టి, ఫిబ్రవరి 6 నుంచి సమ్మెలోకి వెళ్తున్న ఉద్యోగులపై కక్షతోనే ఏపీ సర్కార్ ఇలా వేధింపుల సర్క్యులర్ జారీ చేసిందని ఉద్యోగ సంఘాల నేతలు ఫైరవుతున్నారు. జీతాల బిల్లులు ప్రాసెస్ చేయబోమంటున్న ట్రెజరీ సిబ్బందిపై ఇలా సర్క్యులర్ జారీచేయడాన్ని తప్పుపడుతున్నారు. పైగా టైమ్ లైన్ విధిస్తూ.. గురువారం సాయంత్రంలోగా రివైజ్డ్ బిల్లులు అప్ లోడ్ చేయాలని పే అండ్ అకౌంట్స్ విభాగంలోని డీడీఓలకు సర్క్యులర్ లో సూచించడాన్ని ప్రశ్నిస్తున్నారు.రాష్ట్ర ఆర్థిక శాఖ ఇలా ఒత్తిడి పెంచుతూ సర్క్యులర్ జారీ చేయడంపై పీఆర్సీ సాధన సమితి నేత బండి శ్రీనివాసరావు ఫైరవుతున్నారు. వేతన సవరణపై అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్ణయించి మధ్యంతర భృతి 27 శాతం కన్నా ఫిట్ మెంట్ తక్కువకు అంటే 14.29 శాతానికే పరిమితం చేయడం ఏంటని నిలదీస్తున్నారు.

# మరో వివాదంలో వైసీపీ నేత



గుంటూరు, జనవరి 28, (న్యూస్ పల్స్)వైసీపీ నేతలపై విమర్శలు తీవ్రమవుతున్నాయి. కెసినో, అపైన బాలికతో వ్యభిచారం చేయించేంత నీచానికి కూడా అధికార పార్టీ నేతలు పాల్పడుతున్నారు. తాజాగా వెలుగు చూసిన మీడియా కథనం ప్రకారం.. మాజీ మంత్రి, ప్రస్తుత వైసీపీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ రైట్ హ్యాండ్ భూశంకరరావు వ్యభిచారం కేసులో అరెస్ట్ కావడం సంచలనం అవుతోంది. కాసుల కోసం కక్కుర్తి పడి వైసీపీ నేతలు ఎంతకైనా తెగించేస్తారా? అంటూ పబ్లిక్ నుంచి పబ్లిక్ గానే వస్తున్న విమర్శలు.అధికార వైసీపీ నేతల దోపిడీ చర్యలపై మరో సంఘటన ఇప్పుడు మీడియాలో బాగా వైరల్ అవుతోంది. బాలికతో వ్యభిచారం చేయించారనే కేసులో గుంటూరులోని అరండల్ పేట పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఆ ఐదుగురు నిందితుల్లో వైసీపీలో ఉన్న ఓ మాజీ మంత్రి ముఖ్య అనుచరుడు కన్నా భూశంకరరావు ఉడడం ఇప్పుడు వార్తల్లోకి వచ్చింది. కరోనా బారిన పడిన తల్లీ కూతురు జీజీహెచ్ లో చేరారు. చికిత్స పొందుతూ తల్లి తనువు చాలించింది. కరోనా పూర్తిగా నయం కావాలంటే నాటు వైద్యం చేయిస్తానని జీజీహెచ్ లో పరిచయమైన ఓ మహిళ బాలిక తండ్రికి మాయమాటలు చెప్పింది. ఆమెను నమ్మిన తండ్రి తన కూతుర్ని ఆ మాయ లేడి వెంట పంపించాడు.కరోనా తగ్గిన తర్వాత ఆ బాలికను ఆ కిలాడీ వ్యభిచారంలోని దింపింది. గుంటూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, కాకినాడ లాంటి చోట్ల వ్యభిచారం చేయించింది. ఈ క్రమంలో విజయవాడలో తప్పించుకున్న ఆ బాలిక పేరేచర్లలో ఉన్న తండ్రి వద్దకు చేరుకుని, మేడికొండూరు పీఎస్లో ఫిర్యాదు చేసింది. బాలిక ఫిర్యాదుతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు అరండల్ పేటకు కేసును బదిలీ చేశారు. అరండల్ పేట పోలీసుల విచారణలో ఈ వ్యభిచార ముఠాలో 45 మంది హ్యాండ్ ఉన్నట్లు తేలింది. వారిలో వైసీపీ నేత ముఖ్య అనుచరుడు, నిజాంపట్నానికి చెందిన కన్నా భూశంకరరావు, మరికొందరిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.భూశంకరరావు వైసీపీ ఎంపీ మోపిదేవి వెంకట రమణ అనుచరుడే అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. ఎన్ని నేరాలు చేసినా జగన్ రెడ్డి కాపాడతారనే ధైర్యంతోనే వైసీపీ నేతలు అకృత్యాలకు బరితెగిస్తున్నారని నిప్పులు చెరిగారు. 'యధా లీడర్.. తథా కేడర్' అంటూ సీఎం జగన్, మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ మోపిదేవితో కలిసి భూశంకరరావు ఉన్న ఫొటోను లోకేశ్ తన ట్వీట్ కు జతచేశారుఇప్పటికే కేసినో దందా ఏపీలో హల్చల్ చేస్తోంది. తెలుగు ప్రజలకు అస్సలు అవగాహన, అలవాటు లేని కెసినో సంస్కృతిని దిగుమతి చేసి, పండగ పేరుతో కోట్లాది రూపాయలు జనం నుంచి గుంజుకున్నదీ ఆ సర్కార్ లోని మంత్రివర్యుడే అని మీడియా, ప్రతిపక్షం టీడీపీ కోడై కూస్తోంది. అఫ్ కోర్స్..! కెసినో తన రెండున్నర ఎకరాల కే కన్వెన్షన్ లో నిర్వహించినట్లు నిరూపిస్తే.. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆ ప్రబుద్ధుడు మేకపోతు సవాల్ కూడా చేశారనుకోండి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తంలో కెసినో కంపు మీద కయ్యం బాగా ముదిరిపోతోంది. ఇలాంటి సమయంలో వ్యభిచార–మ్ లాంటి నీచ ప్రవృత్తికీ తెగిస్తుండటం మరింత దారుణం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వైసీపీ నేతలు ఇంకెంత కింది స్థాయికి దిగజారుస్తారో అనే ఆందోళన పలువరి నుంచి వ్యక్తం అవుతోంది. వైసీపీ నేతలు చేస్తున్న అరాచకాలపై ముఖ్య నేత స్పందన ఎలా ఉంటుందనే ప్రశ్న తెర మీదకు వస్తోంది. అక్రమంగా కెసినో నిర్వహించిన మంత్రి కొడాలి నానిపై చర్యలు తీసుకోవాలని, అసలు కేబినెట్ నుంచే బర్తరఫ్ చేయాలని టీడీపీ నేతలు గవర్నర్ ను డిమాండ్ చేస్తున్నారు. బాలికతో వ్యభిచారం చేయించిన కేసులో అరెస్టయిన భూశంకరరావును టీడీపీ నేతలు ఆరోపిస్తున్నట్లు కాపాడతారో? లేక చర్యలు తీసుకుంటారో?

## సి ఎం చే త్వరలో శ్రీనివాస సేతు (గరుడ వారధి) ప్రారంభం

**నిర్మాణ పనులను పరిశీలించిన టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి**

తిరుపతి శ్రీనివాసం సర్కిల్ నుంచి నంది సర్కిల్ వరకు నిర్మాణం దాదాపుగా పూర్తి అయిన శ్రీనివాస సేతు ( గరుడ వారధి) ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేత త్వరలోనే ప్రారంభింపచేస్తామని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన నంది సర్కిల్ సమీపం నుంచి శ్రీనివాసం సర్కిల్ వరకు వారధి మీద ప్రయాణించారు. తుది దశలో ఉన్న పనులను పరిశీలించి ఆఫ్కాన్ సంస్థ అధికారులతో మాట్లాడారు. వారధి మీద ఏర్పాటు చేసిన ఫైబర్ సిగ్నల్స్ ను చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి వారధి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయించాలని పలు మార్లు ముఖ్యమంత్రి ని కోరారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు నిర్మాణం పనులు వేగవంతం చేసి తొలివిడతగా శ్రీనివాసం నుంచి నంది సర్కిల్ వరకు వారధి ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ వారధి ప్రారంభమైతే అటు భక్తులు, ఇటు తిరుపతి స్థానికులకు కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని సుబ్బారెడ్డి తెలిపారు. ఆఫ్కాన్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వామి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా యూనివర్సిటీలో విషాదం..

జెండాలు కడుతూ యువకుడు మృతి..బంధువుల అందోళన

మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీ సెక్యూరిటి గార్డ్ షణ్ముఖం బ్యానర్ కడుతూ విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడురుద్రవరం ప్రాంతానికి చెందినవాడు. యూనివర్సిటీలో జెండాలు కడుతూ విద్యుత్ షాక్కు గురై మృతి చెందాడు. యూనివర్సిటీ లో జరుగుతున్న ఫంక్షన్ కు సంబంధించి జెండాలు కడుతుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో కృష్ణ విశ్వవిద్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతిచెందిన యువకుడు షణ్ముఖ కు న్యాయం చేయాలని సిబ్బంది కోరుతూ గ్రామస్తులు ధర్నా కార్యక్రమం చేపట్టారు

## కొత్త జిల్లాలతో ఎవరికి ప్రయోజనం

**ప్రభుత్వ తీరును ప్రశ్నించిన బోండా ఉమ**



విజయవాడ,జనవరి28( ఎవరి ప్రయోజనాల కోసం కొత్తగా జిల్లాలు పెంచుతున్నారని టీడీపీ నేత బోండా ఉమమహేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగుఉల ఆందోళనచేస్తున్న సమయంలో ఈ జిల్లాల ప్రకటన జరగడం చూస్తుంటే అనుమానాలు ఉన్నాయని అన్నారు. అలాగే శాస్త్రీయత లేకుండా చేపట్టారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఈ విభజనవల్ల ఎవరికైనా ప్రయోజనాలు చేకూరుతాయా?.. ఏ విధంగా ప్రయోజనాలు చేకూరుతాయో వైసీపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. అమ్మకు అన్నం పెట్టలేనోడు చిన్నమ్మకి పట్టుచీర కొంటానన్నాడన్న చందంగా ఈ ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మూడేళ్ల నుంచి ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని, ఇప్పుడు కొత్త జిల్లాలు చేసి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. కొత్త జిల్లాల ప్రతిపాదనల్లో సమతుల్యత లేదని బోండా ఉమ విమర్శించారు.

## నంద్యాల జిల్లాకు భూమా నాగిరెడ్డి పేరు పెట్టాలి: అఖిల ప్రియ



విజయవాడ జనవరి 28 కొత్తగా ప్రకటించిన జిల్లాలకు టీడీపీ నేతలతో పాటు కొన్ని వర్గాల ప్రజలు కొన్ని పేర్లు సూచిస్తున్నారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లాలోని నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. నంద్యాల కేంద్రంగా కొత్త జిల్లాను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఆళ్లగడ్డ బనగానపల్లె నంద్యాల డోన్ నందికొట్కూరు శ్రీశైలం నియోజకవర్గాలు ఈ జిల్లా పరిధిలోకి వస్తాయి. అయితే దీనికి దివంగత నేత భూమా నాగిరెడ్డి పేరు పెట్టాలని ఆయన తనయ మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ కొత్త డిమాండ్ లేవనెత్తారు.భూమా కుటుంబానికి నంద్యాల ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో గట్టి పట్టుంది. 2004 మినహా 1994 నుంచి 2014 వరకు ఆళ్లగడ్డపై భూమా దంపతుల పట్టు కొనసాగింది. దివంగత నేతలు భూమా నాగిరెడ్డి భూమా శోభా నాగిరెడ్డి మూడు సార్లు చొప్పున ఆళ్లగడ్డ నుంచి గెలిచారు. టీడీపీ ప్రజారాజ్యం వైసీపీ నుంచి విజయాలు సాధించారు. నంద్యాలలోనూ ఆ కుటుంబానికి మంచి పట్టుంది.2014లో భూమా నాగిరెడ్డి నంద్యాల నుంచి ఆయన కుమార్తె భూమా అఖిల ప్రియ ఆళ్లగడ్డ నుంచి వైసీపీ తరపున గెలిచారు. కానీ ఆ తర్వాత టీడీపీలోకి చేరారు. నాగిరెడ్డి మరణం తర్వాత అఖిల ప్రియకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి పదవి ఇచ్చారు. ఈ నేపథ్యంలో భూమా నాగిరెడ్డి హయాంలో నంద్యాల ఆళ్లగడ్డ నియోజకవర్గాలు అభివృద్ధి పథంలో ప్రయాణించాయని ఆయన చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించాలని అఖిల ప్రియ డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటు చేసే నంద్యాల జిల్లాకు భూమా నాగిరెడ్డి పేరును పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. భూమా నాగిరెడ్డి ఓటమి లేని నాయకుడని నంద్యాల రూపురేఖలు మార్చారని ప్రియ తెలిపారు. ఈ డిమాండ్పై ప్రియతో పాటు తెలుగు దేశం పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారని సమాచారం. నంద్యాల ఆళ్లగడ్డ నియోజకవర్గాల టీడీపీ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రభుత్వానికి తమ డిమాండ్ గట్టిగా వినిపిస్తామని అఖిల ప్రియ అంటున్నారు. నంద్యాలకు భూమా నాగిరెడ్డి పేరు పెట్టడం ఆయనకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని ఆమె పేర్కొన్నారు. మరోవైపు అఖిల ప్రియ డిమాండ్పై విమర్శలు కూడా వస్తున్నాయి.ఇటీవల పుట్టిన తన కొడుకుకు బాహు అని నామకరణం చేసుకున్న అఖిల ప్రియ జిల్లాకు మాత్రం తన తండ్రి పేరు పెట్టాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందనే మాటలు వినిపిస్తున్నాయి. తండ్రిపై ఆమెకు ప్రేమ ఉండడంలో తప్పు లేదు కానీ తన బిడ్డకు మాత్రం కొత్త పేరు పెట్టుకుని జిల్లాకు మాత్రం తండ్రి పేరు పెట్టాలని కోరడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల మేరకు ప్రస్తుతం ఉన్న 13 జిల్లాలను 26గా మారుస్తూ అధికార వైసీపీ మంత్రివర్గం ఆమోదం తెలిసిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఈ కొత్త జిల్లాల ఏర్పాటు జరగబోతుంది. అయితే జిల్లా కేంద్రాల విస్తరణ నియోజకవర్గాల విలీనం కొత్త జిల్లాల పేర్లు తదితర విషయాలపై ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేకత వస్తోంది. సొంత పార్టీ వైసీపీ నుంచే ఇలాంటి నిరసన వ్యక్తం అవుతుండడం గమనార్హం.

## 3000 కేజీలు పిడిఎఫ్ బియ్యం స్వాధీనం

చిత్తూరు చిత్తూరు జిల్లా సత్యవేడు వి ఆర్ కండ్రిగ చెక్ పోస్ట్ దగ్గర ఎస్సై పురుషోత్తం రెడ్డి, వీరాంజనేయులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సత్యవేడు నుండి ఆల్లప్పగుంటకు వెళుతున్న ఆటోలో 20 బస్తాలు పిడిఎఫ్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ ఆటో డ్రైవర్ భాస్కర్ నుఅదుపులో తీసుకొని విచారించగా వారి ఇంట్లో 30 బస్తాలు ఉన్నట్లు చెబుతూ ఈ బియ్యాన్ని సులూరుపేట్ట దగ్గర ఉన్న వాటంబేడు గ్రామానికి చెందిన కాటయ్య, బాలయ్యకు సప్లై చేసినట్లు తేలింది. ఆటో డ్రైవర్ భాస్కర్ దగ్గర మొత్తం మూడువేలు కేజీలు పిడిఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రెడ్డి శేఖర్, జయరామిరెడ్డి, లోకయ్య, తదితర సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

## పీఆర్సీపై క్లారిటీ వచ్చే వరకు పాతజీతాలే ఇవ్వాలి

**పీఆర్సీ సాధన సమితి ప్రతినిధి బొప్పరాజు వెంకటేశ్వర్లు**

అమరావతి,జనవరి28(: పీఆర్సీపై ఏపీలో దుమారం రేగుతోంది. ఇటీవల ఏపీ ప్రభుత్వం 11వ పీఆర్సీని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పీఆర్సీ పై ఉద్యోగసంఘాలు అసంతృప్తితో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పీఆర్సీ సాధన సమితి ప్రతినిధి బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం వద్దు కానీ.. ఆర్టీసీ ఆదాయం మాత్రం కావాలా..? అని ఆయన ప్రశ్నించారు. పీటీడీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు.. ప్రమోషన్లు తక్షణం చేపట్టాలని అన్నారు. ఆర్టీసీ ఆస్పత్రులన్నీ అప్డేట్ చేయాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పేరు చెప్పే ఆర్టీసీ ఉన్నతాధికారులు.. చర్యలు మాత్రం తీసుకుంటా మంటారు. మేం చర్చలకు వెళ్లినా.. చర్చలకు రాలేదని ప్రభుత్వం మమ్మల్ని తప్పు పడుతోంది. జీతాలు ఇవ్వకుంటే ఉద్యోగుల్లో అన్ రెస్ట్ వస్తుందని ప్రభుత్వం భావిస్తోందేమో..? వచ్చే నెల 1న పాత జీతాలే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పీఆర్సీ పై చర్చించేందుకు ఇప్పటికే చాలా సార్లు ప్రయత్నించామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఎంతో ఆశపడ్డమని ఆయన అన్నారు. పీఆర్సీపై క్లారిటీ వచ్చే వరకు పాత జీతాలే ఇవ్వాలని ఆయన వ్యాఖ్యానించారు.

## కోనసీమలో కరోనా వణుకు

**స్కూళ్లలో టీచర్లు, విద్యార్థుల్లో ఆందోళన**

కాకినాడ,జనవరి28(: జిల్లాస్థాయిలో కోనసీమలో పాజిటివిటీ రేటు ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు కరోనా వైరస్ బారిన పడుతున్నారు. ముఖ్యంగా కొవిడ్ బాధితులను ఆదుకునే లక్ష్యంతో కొవిడ్ కేర్ సెంటర్ను పునరుద్ధరించి బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు.కరోనా థర్డ్ వేవ్ ప్రభావం కోనసీమలో రోజురోజుకూ పెరుగుతోంది. భారీగా కేసులు నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాజిటివ్ కేసులు ఇంటింటా ఉన్నప్పటికీ పరీక్షలు నామమాత్రంగానే చేయడంతో కేసుల సంఖ్య అధికారికంగా స్వల్పంగా నమోదవుతోంది. గత కొన్ని రోజులుగా వైరస్ వ్యాప్తి తీవ్రమైంది. సంక్రాంతి పర్వదినాల తర్వాత వైరస్ ప్రభావం తీవ్రంగా వ్యాపిస్తుండడంతో ప్రజలు స్వల్ప లక్షణాలతో కొవిడ్ బారిన పడి ఇళ్లల్లోనే మందులు వాడుతూ కోలుకుంటున్నారు. కోనసీమవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు హాజరవుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సైతం పాజిటివ్ నిర్ధారణ అవుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పలు బ్యాంకుల్లోని సిబ్బందికి పాజిటివ్ తేలడంతో అవి మూతపడే పరిస్థితి కనిపిస్తోంది. అనేకచోట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు కరోనా బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు.దీంతో గ్రామస్తులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

## పొత్తులో కమలం... చిత్తవుతున్న కాంగ్రెస్



ముంబై, జనవరి 28, (న్యూస్ పల్స్)భారతీయ జనతా పార్టీ తో పొత్తు పెట్టుకుని శివసేన 25 ఏళ్లు వృధా చేసిందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ఆదివారం పేర్కొన్న విషయం తెలిసిందే. శివసేన అధినేత ఠాక్రే.. తన తండ్రి, శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే 96వ జయంతిని పురస్కరించుకుని ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్సిపి, కాంగ్రెస్ పార్టీని కలుపుకొని సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ఉద్ధవ్ ఠాక్రే.. తన పూర్వ మిత్రపక్షమైన బీజెపిపై విరుచుకుపడుతూనే.. తన ప్రధాన హిందూత్వ భావజాలాన్ని వదులుకోమని స్పష్టంచేశారు. ప్రత్యర్థి అయిన బిజెపితో తలపడేందుకు.. కాంగ్రెస్ కు ప్రాంతీయ నాయకుల ముందు లొంగిపోయేలా చేసింది.. అయితే ఇది భారతీయ జనతా పార్టీ జాగ్రత్తగా రూపొందించిన కూటమి వ్యూహం.. జాతీయ రాజకీయాల్లో బలాన్ని ఇచ్చిందని వ్యాసకర్త అజయ్ ఝా రాశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో అజయ్ ఝా కీలక వ్యాసం రాశారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఫిబ్రవరి 10 మరియు మార్చి 7 మధ్య ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో పొత్తులు కీలాకాంశంగా మారాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఐదు రాష్ట్రాల్లో విచిత్రమైన పొత్తులు రాజకీయ వేడిని పెంచుతున్నాయి. అంతేకాకుండా ప్రధాన పార్టీలకు సవాళ్లను సైతం విసురుతున్నాయని అజయ్ ఝా పేర్కొన్నారు.విచిత్రమైన పొత్తులు.. మునుపటి క్రూరత్వ చరిత్రను గుర్తుచేస్తున్నాయి. పోలింగ్ జరిగే అన్ని రాష్ట్రాలలో అధికారాన్ని పంచుకోవాలనే ఏకైక ఉద్దేశ్యంతో పలు పార్టీల నాయకులు కలిసి వస్తున్నారు. అయితే గతంలో ఒకరినొకరు భాగస్వాములుగా భావించిన కొందరు విడిపోతున్నారు. కానీ అరుదుగా 25ఏళ్ల పాటు కొనసాగిన స్నేహం.. ఇటీవలి కాలంలో తెగదెంపులైంది. మూడు పార్టీల సంకీర్ణానికి ముఖ్యమంత్రిగా నాయకత్వం వహిస్తున్న మహారాష్ట్ర పాలక పార్టీ శివసేన అధినేత ఉదవ్ ఠాక్రే వ్యాఖ్యలు ఆలోచించేలా చేశాయని అజయ్ ఝా పేర్కొన్నారు. దీనిపై మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ఇలా వ్యాఖ్యానించడం బిజెపీతో పొత్తు పెట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరేను అవమానించడమేనని.. పేర్కొన్నారు. తన తండ్రి ఆశయాన్ని నెరవేర్చేందుకు ఉద్ధవ్కు బీజేపీ ఎన్నో అవకాశాలను కల్పించింది. తద్వారా 2014 రాష్ట్ర ఎన్నికల నాటికి శివసేన ప్రధాన పార్టీగా అవతరించింది. అలా బీజేపీ–శివసేన రెండు కలిసి ఎక్కువ సీట్లు గెలుచుకున్నాయి. దేవేంద్ర ఫడ్నవీస్ రాష్ట్రంలో బీజేపీ మొదటి ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. 2019 రాష్ట్ర ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవి కోసం ఉదవ్ ఠాక్రే డిమాండ్ చేయడం.. బిజెపి నిరాకరించడం లాంటి పరిస్థితులు చూశాం. ఆతర్వాత కూటమిని రద్దు చేశారు. ఈ క్రమంలో ఠాక్రే.. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపి.. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శివసేన జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టడం కాస్త ఆలోచించాల్సిన విషయం.1996లో శిరోమణి అకాలీదళ్, బిజెపీ కలిసి వచ్చినప్పుడు పంజాబ్లో ఇలాంటి కూటమి పుట్టింది. వారు సహజ మిత్రులుగా కూడా కనిపించారు ? అకాలీ రాజకీయాలు గురుద్వారాలు–సిక్కుల చుట్టూ తిరుగుతాయి. బిజెపీ హిందువుల పార్టీగా ప్రచారం చేసింది. 2017లో రాష్ట్ర ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసే వరకు కూటమి బాగా పనిచేసింది. 2019లో బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ప్రభుత్వం నుండి శివసేన, ఆ తర్వాత వ్యవసాయ చట్టాలపై పోరులో అకాలీదళ్ తెగదెంపులు చేసుకుంది. అకాలీలు ఇప్పుడు బహుజన్ సమాజ్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఫిబ్రవరి 20న పంజాబ్ ఎన్నికలకు వెళుతున్నారు. అయితే బీజేపీ పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ పంజాబ్ లోక్ కాంగ్రెస్, విడిపోయిన శిరోమణి అకాలీదళ్ (సంయుక్త్)తో చేతులు కలిపింది. శిరోమణి అకాలీదళ్తో పొత్తు పెట్టుకుని ఆ పార్టీ చేయలేని పని, పంజాబ్ కూటమిలో బీజేపీ పెద్దన్నగా అవతరించింది. రాష్ట్రంలో బిజెపీ సంస్థాగతంగా బలహీనంగా ఉంది. ఈ కూటమి ఇప్పుడు మేలు చేసినా.. చేయకపోయిన.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీజేపీ ప్లాన్ రచించింది.బీజేపీ బలాన్ని పెంచుకునేందుకు వ్యూహంతో ప్రాంతీయ పార్టీలతో పొత్తును కొనసాగిస్తోంది. అయితే.. మనుగడ కోసం ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షాల ముందు సాగిలపడుతోంది. ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ రెండంకెల సీట్లు దాటడం కూడా కష్టమే.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా విఫలయత్నం చేసేందుకు ఉత్తరప్రదేశ్లో ములాయం సింగ్ యాదవ్తో, పొరుగున ఉన్న బీహార్లో లాలూ ప్రసాద్ యాదవ్తో కలిసి పయనిస్తూ.. వారి ముందు లొంగిపోతోంది. ఫలితంగా బీజేపీ వ్యూహాలతో కాంగ్రెస్ ప్రభావం కూడా తగ్గుతోంది. అయితే.. ముందుచూపు లేకపోవడం కూడా పశ్చిమ బెంగాల్, తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ దాదాపు పతనానికి దారితీసింది. ఎందుకంటే అది గతంలో పాలించిన రెండు రాష్ట్రాల్లో తన మిత్రపక్షాలను మారుస్తూ వచ్చింది. ఇలా చేయడం వల్ల పశ్చిమ బెంగాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ద్రవిడ మున్నేట్ర కజగం దయతో ప్రస్తుతం తమిళనాడులో అధికారాన్ని పంచుకుంది. అయితే.. బీహార్ ఎన్నికల్లో అనుసరించిన మాదిరిగానే.. బీజేపీ తన మిత్రపక్షాలను జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటోంది. ఇలానే గోవా, పంజాబ్ లలో పొత్తులను నిర్ణయించుకుంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ తన పొరపాట్లను గ్రహించి, తన వ్యూహాన్ని సవరించుకోకుంటే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఎదురీత తప్పదు

## కడప ఎయిర్పోర్టుపై సోము వివాదాస్పద వ్యాఖ్యలు

**మండిపడుతున్న స్థానిక నేతలు**

**వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్న గడికోట**

కడప,జనవరి28(: కడప ఎయిర్పోర్ట్పై శుక్రవారం సోము వీర్రాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రాణాలు తీసే ప్రాంతాల్లో కూడా ఎయిర్పోర్ట్లు కట్టించామని, వాళ్లకు ప్రాణాలు తీయడం మాత్రమే తెలుసని అన్నారు. కానీ తాము ఎయిర్పోర్ట్లు కడుతున్నామని చెప్పారు. ఎయిర్పోర్ట్ల విషయం కేంద్రం చూసుకుందని, రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు సరిగా వేయాలని సోము వీర్రాజు సూచించారు. వీర్రాజు వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఆయన తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కడప జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ నేత సోము వీర్రాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. 'మేము అధికారంలోకొస్తే రూ.50కే చీప్ లిక్కర్ బాటిల్ ఇస్తాం' అంటూ వీర్రాజు ప్రకటించినసంగతి తెలిసిందే. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. సోము వైన్స్.. సారాయి వీర్రాజు అంటూ నెటిజన్లు ఆయనను ఓ రేంజ్లో ఆడేసుకున్నారు. ఇతర పార్టీల నేతలు, సామాన్యులతోపాటు సొంతపార్టీ కార్యకర్తలు సైతం వీర్రాజు వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు పరువు పోయిన తర్వాత నా వ్యాఖ్యలను వక్రీకరించారని ప్రకటించారు. ఈ వివాదం ఇంకా చల్లార ముందే మరోసారి కడప ఎయిర్పోర్టుపై వ్యాఖ్యలుచేశారు. బీజేపీ నేత సోము వీర్రాజు వ్యాఖ్యలు కడప జిల్లాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వీర్రాజు వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలు తీవ్రంగా బాధిస్తున్నాయని చెప్పారు. సోము వీర్రాజు జిల్లాలో కనిపిస్తే ప్రజలు దాడిచేస్తారని హెచ్చరించారు. తాను ప్రజాస్వామ్యంలో లేకపోయి ఉంటే.. సోము వీర్రాజు నాలుక కోసేవాడినని రాచమల్లు ప్రసాదరెడ్డి హెచ్చరించారు. ప్రాణాలు తీసే ప్రాంతంలో కూడా ఎయిర్పోర్ట్లు కట్టించామని, వాళ్లకు ప్రాణాలు తీయడం మాత్రమే తెలుసని కడప ఎయిర్పోర్ట్పై సోము వీర్రాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కడప జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. మన పార్టీ సిద్ధాంతం గురించి చెప్పి ఓట్లు అడగాల్సిన మీరు ఒక హిందూ జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా ఎలా ఉండకూడదో ప్రతి కార్యకర్తా మిమ్మల్ని చూసి నేర్చుకునే విధంగా ఉంది' అంటూ నెటిజన్లు మండిపడ్డారు. సోము వీర్రాజు.. కడప ఎయిర్పోర్టు విషయంలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.. ఆయన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి.. బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఓ ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్న ఆయన.. కడప ప్రజలు మనుషులను చంపుతారని వారికి ఎయిర్ పోర్టు అవసరమా అని సోమువీర్రాజు వ్యాఖ్యలు చేయడం శోచనీయం అన్నారు.. ఆయన తన మాటలు వెంటనే వెనక్కు తీసుకోవాలి.. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లాభాల కోసం సినిమాల్లో ఆ ప్రాంత సాంస్కృతిని దిగజార్చారని మండిపడ్డారు శ్రీకాంత్ రెడ్డి.. ఆ ప్రాంతంలో బీజేపీ జెండా పట్టుకుని తిరిగే వారున్నారు.. వాళ్లయినా, సోము వీర్రాజు అయినా ఈ వ్యాఖ్యలపై సిగ్గుపడాలన్న ఆయన.. రాయల సీమ ప్రజలను ఫ్యాక్షనిస్టులుగా చిత్రీకరణ చేశారు.. రాష్ట్రంలో ఏ ప్రాంతాల్లో ఎఫ్ఐఆర్ లు నమోదు అవుతూన్నాయో సోము వీర్రాజు చూడాలని హితవుపలికారు.. వెంటనే ఆయన వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.. రాయల సీమ సంస్కృతిని సినిమాల్లోనే కించపరిచేలా వ్యవహరించారని.. టీడీపీ తన పబ్బం గడుపుకోవడం కోసం ఫ్యాక్షన్ గొడవలు రేపిందని ఆరోపించిన ఆయన.. మ్దదెలచెరువు సూరికి కూడా ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేందుకు తిరస్కరించిన ఘనత వైఎస్ ది అని గుర్తుచేశారు.

# ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలి




. ఎమ్మిగనూరు జనవరి 28,( విభారె) . ఎమ్మిగనూరు పట్టణంలో ఆదోని జిల్లా ఏర్పాటుకై ప్రజాప్రతినిధులు ఉద్యమానికి సిద్ధం కావాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీ డీ ఎస్ యూ) జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర బాబు డిమాండ్ చేశారు.అనంతరం ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్ప సర్కిల్ నందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర బాబు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆదోని రెవిన్యూ డివిజన్ రెండో ముంబైగా పేరుగాంచినది అలాంటి రెవెన్యూ డివిజన్ ను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాగా ప్రకటించక పోవడం చాలా దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని రెవెన్యూ డివిజన్ నందు ఎమ్మెల్యేలు ప్రతిపక్షాలు జిల్లా సాధనకై ఉద్యమాని చేపట్టాలని లేనిపక్షంలో వారి కార్యాలయాలు ఇంటి ముట్టడికి విద్యార్థులు యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## ఆదోని జిల్లాఏర్పాటుక్కై ప్రజా ప్రతినిధులు ఉద్యమానికి సిద్ధం కావాలి

## పీ డీ ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర బాబు

కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని అన్నారు.రాష్ట్రంలోనే ఎక్కడలేని విధంగా అక్షరాస్యత, నిరుద్యోగిత, బాల్య వివాహాలు, తాగడానికి నీరు లేక చాలా రకములైన ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పశ్చిమ ప్రాంతంలో ఎక్కువ స్థాయిలో ప్రజలు వలసలు వెళ్తున్నారని అన్నారు. కానీ ఇక్కడ ఉన్నటువంటి ఎమ్మెల్యేలు ప్రభుత్వ అధికారులు పట్టించుకోకుండా ఉన్నారని అన్నారు. ముఖ్యంగా పెండింగ్లో ఉన్నటువంటి ప్రాజెక్టులను పూర్తి చేసి, వేదవతి రిజర్వాయర్ లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కావున ఆదోని రెవెన్యూ డివిజన్ ను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. అదేవిధంగా మూతపడిన కాలువలను ప్రభుత్వం పూడిక తీసి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చేయాలని డిమాండ్ చేశారు. పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలి, ఎమ్మిగనూరులో టెక్స్టైల్ పరిశ్రమ ఏర్పాటు చేయాలి. మంత్రాలయంను టూరిజం లాగా ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదోని జిల్లాగా ప్రకటించాలని లేనిపక్షంలో పీ డీ ఎస్ యూ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమానికి సిద్ధమైతామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు తాలూకా అధ్యక్షులు రామకృష్ణ నాయుడు, నాయకులు జావీద్, కిరణ్, శ్రీను, రాజు, అనిల్, అశోక్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ శ్రీ చైతన్య పాఠశాలల పై చర్యలు తీసుకోవాలి

### డి ఎస్ ఎఫ్

. ఎమ్మిగనూరు జనవరి 28,( విభారె) ఎమ్మిగనూరు పట్టణంలో నారాయణ శ్రీ చైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి డి ఎస్ ఎఫ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు అన్నారు స్థానిక ఎమ్మిగనూరులో డిప్యూటీ తాసిల్దార్ రమాదేవి గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డి ఎస్ ఎఫ్ సురేంద్రబాబు మాట్లాడుతూ ఎమ్మిగనూర్ లో కార్పొరేట్ పాఠశాలలు తమ ఇష్టానుసారంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి కార్పొరేట్ నారాయణ చైతన్య వివిధ రకాల పేర్లతో తల్లిదండ్రుల నుండి



ఫీజులను వసూళ్లు చేస్తున్నారని తెలియజేశారు అదేవిధంగా ఆ పాఠశాలలకు కనీస వసతులు లేకుండా ఫీజుల బోర్డు ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారంగా తల్లిదండ్రుల నుంచి వేళలో ఫీజులు వసూలు చేస్తున్న ఈ పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో డి ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ ఎస్ నాయకులు వీర,ప్రతాప్, రామంజి, హాజీ అర్జున్ పాల్గొన్నారు..

# కొత్త జిల్లాల నిర్ణయం ప్రజలకు అనుకూలంగాచేయాలి...

### సిపిఐ ఎంఎల్ లిబరేషన్

నందికొట్కూర్(జనవరి 28,( విభారె)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రజల సౌలభ్యం కొరకు ఏర్పాటు చేస్తున్న కొత్త జిల్లాల నిర్ణయం ప్రజలకు అనుగుణంగా ఉండాలని కర్నూలు జిల్లా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి జూ. వెంకటేశ్వర్లు అఖఎఓఒ. లిబరేషన్ డివిజన్ కార్యదర్శి గోపాలకృష్ణ విప్లవ యువజన సంఘం జిల్లా నాయకుడు ఎ నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం నాడు సిపిఐ ఓఒ.లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లానందికొట్కూర్ మున్సిపాలిటీ పట్టణంలో పాత బస్టాండ్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మండల తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూరాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా ఏర్పాటు చేయడం వలన ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు అలా కాకుండా ప్రస్తుతం ఉన్నటువంటి కర్నూలు జిల్లానునంద్యాల జిల్లాగా చేయడం వలన నంద్యాల పరిధిలో ఉన్నటువంటి పాణ్యం మండలం నుండి నంద్యాలకు 14 కిలోమీటర్ల దూరం ఉంటుందని గడివేముల ఇలాంటి మండలాలను మండలాలను నంద్యాల జిల్లాలో కలపాలని నందికొట్కూరు నుండి కర్నూలుకు 30 కిలోమీటర్ల దూరం ఉంటుందని అదే నందికొట్కూరు నుండి నంద్యాల కు70. కిలోమీటర్లు దూరం ఉంటుందని కొత్తపల్లి మండలాల్లోని కపిలేశ్వరం సంగమేశ్వరం ఎర్ర మఠం మండలం లోని గ్రామాలకు దాదాపు 80 కిలోమీటర్ల దూరం ఉంటుంద నీ దీనివల్ల ప్రజలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ాఖ కార్యాలయం ఆర్ డి ఓ ఆఫీస్ గాని ఇతర ఆఫీసులకు పోవడానికి చాలా ఇబ్బందికరంగా ఉంటుందని తక్షణమే జిల్లాల పునర్విభజన భాగంగా నందికొట్కూరు నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలో కలపాలని నియోజకవర్గ ఎమ్మెల్యే గారు ఎంపీ గారు ముఖ్యమంత్రి గారికి నివేదిక




తయారు భ్చేసి ఇ పంపాలని కోరుచున్నాము లేకపోతే వామపక్షప్రజా సంఘాలు ప్రజలతో కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మండల కార్యదర్శి చందమామల నాగన్న. కలం భాష. అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ా బి బి. ఏ ఐ సి సి టి యు తాలూకా నాయకులు ా సయ్యద్ బాషా. ఆటో యూనియన్ నాయకులు శేఖర్. ఉపేంద్ర.రంగడు. విప్లవ యువజన సంఘం జిల్లా నాయకులు అ. సురేష్.సి ఎస్ ఐ పాలెం హరి అశోకు. చిన్నయ్య. తదితరులు పాల్గొన్నారు

# కుటుంబాలను కాటేస్తున్న మట్కా పేకాటలు

## మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా మట్కా, పేకాట

## మట్కా,పేకాట వల్ల వీధిన పడ్డ కుటుంబాలు

## ప్రజాప్రతినిధుల అండదండలతో నిర్వహిస్తున్నట్లు సమాచారం

తుగ్గలి:జనవరి 28,( విభారె) ప్రస్తుత సమాజంలో మట్కా,పేకాటలు ప్రజా జీవితంలో తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.యువకులు మట్కా,పేకాటలకు దాసోహమయ్యి తమ జీవితాలను నాశనం చేసుకుంటూ అప్పుల పాలు అవుతున్నారు.తక్కువ వ్యవధిలో ఎక్కువ సంపాదించగలమన్న ఆశతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా ఆడుతున్నారు.తుగ్గలి మండలం వ్యాప్తంగా కొందరు వ్యక్తులు ప్రజాప్రతినిధుల మరియు అధికారుల అండదండలతో విచ్చలవిడిగా మట్కా,పేకాటలను నిర్వహిస్తున్నట్లు పలువురు ప్రజలు తెలియజేస్తున్నారు.పోలీసుల కళ్లుగప్పి కొందరు వ్యక్తులు మండలంలో మట్కా ను మరియు పేకాటలను నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.ప్రస్తుత సమాజంలో మట్కా,పేకాట మరియు బెట్టింగ్ లు యువత పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పోలీసులు మట్కా మరియు పేకాట నిర్వహించే వారి పైన కఠిన చర్యలు తీసుకున్నా కూడా ఇవి అదుపులోకి రావడం లేదని ప్రజలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని వాడుకుంటూ గుట్టుచప్పుడు కాకుండా ఫోన్ల ద్వారా బెట్టింగ్ లను నిర్వహిస్తున్నట్లు ప్రజలు తెలియజేస్తున్నారు. పేకాట,మట్కా మరియు బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాల వెనుక ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు ఉన్నట్లు విశ్వనీయ సమాచారం.ఇందులో పెద్ద వారి ప్రమేయం ఉండడంతో పోలీసులు కూడా ముందడుగు వేయలేకపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.సమాజంలో మట్కా, పేకాట మరియు బెట్టింగ్ ల వలన యువకులు చెడు మార్గాల వైపు వెళ్లి కుటుంబాలను అప్పులపాలు చేస్తున్నారు.అదేవిధంగా మండలంలోని కొందరు రైతులు వీటికి దాసోహం అయ్యి పొలాలను కూడా అమ్మి పేకాట,మట్కా లను ఆడుతున్నట్లు సమాచారం.చెన్నంపల్లి గ్రామంలో కొద్ది రోజుల క్రితం మట్కా డబ్బుల వ్యవహారంలో ఇబ్బందులు ఎదురయ్యి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు కఠినంగా వ్యవహరించి ఎటువంటి వారినైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొని వీటిని అరికట్టాలని మండల ప్రజలు,యువకులు తెలియజేస్తున్నారు.





# పాత పిఆర్సి ప్రకారమే జీతాలను చెల్లించాలి...

### ఏపీటీఎఫ్



తుగ్గలి జనవరి 28,( విభారె) : రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఆదేశాలతో జనవరి నెల జీతాలు పాత పిఆర్సి ప్రకారం ఐదు డీఏ లతో కలిపి చెల్లించాలని ఉపాధ్యాయులు అంగీకార పత్రాన్ని అందజేస్తున్నారు.ఈ సందర్భంగా శుక్రవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని ఎంఆర్సి కార్యాలయం నందు ఏపీటీఎఫ్ యూనియన్ పక్షాన మండల పరిధిలోని గల పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మండల విద్యాధికారి రమా వెంకటేశ్వర్లు కు పాత పిఆర్సి ప్రకారం ఐదు డీఏ లతో కలిపి జనవరి నెల జీతాలను అందజేయాలని అంగీకార పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల సెక్రెటరీ ఉమామహేశ్వర్,జిల్లా కార్యదర్శి లోకనాథ్,జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు,ప్రెసిడెంట్ రవీంద్ర నాయక్,భాస్కర్ రెడ్డి,సంజన్న,భాస్కర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టెన్త్ క్లాస్ జ్ఞాపకాలతో మరో సినిమా





స్కూల్ డేస్ మెమరీస్ ఎప్పటికీ ప్రత్యేకమే. ఆ దశలో జరిగిన చిలిపి సన్నివేశాలు.. అల్లరి సంగతులు మన మనదిలో ఎప్పటికీ చెదిరిపోని మధురమైన జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అలాంటి మధుర జ్ఞాపకాల్ని మళ్లీ మన ముందుకు తీసుకొస్తున్నారు 'గరుడవేగ' అంజి. ఆయన తొలిసారి దర్శకుడిగా మారుతూ టెన్త్ క్లాస్ జ్ఞపాకాలతో ఓ సరికొత్త నేపథ్యంలో ఓ సినిమాని రూపొందిస్తున్నారు. 'టెన్త్ క్లాస్ డైరీస్' పేరుతో ఈ చిత్రం రూపొందుతోంది. శ్రీరామ్ అవికాగోర్ శ్రీనివాసరెడ్డి శివ బాలాజీ భానుశ్రీ వేద హిమజ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.అజయ్ మైసూర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎస్.ఆర్ మూవీ మేకర్స్ అన్విత అవని క్రియేషన్స్ బ్యానర్ పై అచ్యుత్రామారావు .పి రవితేజ మన్యం సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం కొంత మంది స్నేహితుల జీవితాల్లో జరిగిన తీపి చేదు జ్ఞాపకాల సమాహరంగా 'టెన్త్ క్లాస్ డైరీస్'ని రూపొందించారు. తాజాగా ఈ చిత్ర టీజర్ ని విడుదల చేశారు. 'ప్రతీ ఒక్కరి జీవితం కథగా మారడం మొదలయ్యేది ఈ క్లాస్ రూమ్ లోనే .. అంటూ హీరో శ్రీరామ్ చెబుతున్న డైలాగ్ లతో టీజర్ మొదలైంది.చిందిని కోసం శ్రీరామ్ గత 20 ఏళ్లుగా ఎదురుచూస్తుంటాడు. ఆ సమయం ఎప్పుడొస్తుందా? అని కోరుకుంటుంటాడు. ఈ నేపథ్యంలో రీ యూనియన్ పేరుతో ఓ కార్యక్రమాన్ని రూపొందించాలని దానికి స్నేహితుల్ని అందరిని ఆహ్వానించాలని తన స్నేహితురాలు హిమజతో చెబుతాడు. ఐడియా బాగుంది అంటుంది హిమజ. ఇంతకీ చాందిని శ్రీరామ్ ప్లాన్ చేసిన రీ యేనియన్ కి వచ్చిందా? .. హాఫ్ బాయిల్ ఎవరు? ..చాందిని – శ్రీరామ్ ల మధ్య ఏం జరిగింది? .. తన వల్ల చాందిని జీవితం నాశనం అయిందని శివబాలాజీ ఎందుకు శ్రీరామ్ ని దూషించాడు అన్నది ఆసక్తికరంగా వుంది. అయితే రీ యూనియన్ థాట్ ఇప్పటికే '96' ఆధారంగా తెలుగులో రీమేక్ అయిన 'జాను'లో రావడంతో ఆడియన్స్ కొత్తగా ఫీలయ్యే అవకాశం లేదు. కానీ సరదా సన్నివేశాలు కొత్తగా వుంటే మాత్రం ఖచ్చితంగా ఈ సినిమా మళ్లీ ప్రతీ ఒక్కరికీ తమ తమ స్కూల్ డేస్ ని గుర్తు చేయడం గ్యారంటీ అంటున్నారు. సరికొత్త కథ కథనాలతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మార్చి 4న వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేయబోతున్నారు.

## 'ధమాకా' పోస్టర్: అల్ట్రా-స్టైలిష్ లుక్ లో మాస్ మహారాజా..!

మాస్ మహారాజా రవితేజ లైన్ లో పెట్టిన ఆసక్తికరమైన చిత్రాల్లో "ధమాకా" కూడా ఒకటి. ఇది స్టార్ హీరో కెరీర్ లో 69వ చిత్రం. త్రినాథ రావు నక్కిన తెరకెక్కిస్తున్న ఈ అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ 'డబుల్ ఇంపాక్ట్' అనే ట్యాగ్ లైన్ తో వస్తోంది. అనౌన్స్ మెంట్ పోస్టర్ తోనే ఇంట్రెస్ట్ కలిగించిన మేకర్స్.. నేడు (జనవరి 26) రవితేజ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ చిత్రానికి సంబంధించిన కొత్త పోస్టర్ ను విడుదల చేశారు.రవితేజ ఈ పోస్టర్ లో బ్లాక్ జీన్స్ – చారల చొక్కా ధరించి అల్ట్రా-స్టైలిష్ లుక్ లో జాయ్ ఫుల్ గా కనిపిస్తున్నారు. బ్యాక్ గ్రౌండ్ లో డ్యాన్సర్స్ మరియు అతని ఫోజ్ ను పరిశీలిస్తే ఈ స్టిల్ సినిమాలోని డ్యాన్స్ నంబర్ లోనిదని అర్థం అవుతుంది.




# కష్టాన్ని ఇష్టపడేవారికి రవితేజ ఆదర్శమే!




రవితేజ అంటే జోష్ .. రవితేజ అంటే ఎనర్జీ .. రవితేజ అంటే మాస్ మహారాజ్. తెలుగు తెరపై చాలామంది హీరోలు తమదైన ముద్రవేశారు .. తమదైన సంతకం చేశారు. అలాంటి హీరోలందరి జాబితాలోను మాస్ కంటెంట్ ఉన్న సినిమాలు పుష్కలంగా ఉన్నాయి. కానీ రవితేజకి మాత్రమే మాస్ మహారాజ్ అనే బిరుదు దక్కింది. దాని వెనుక ఆయన కసి .. కృషి .. అంకితభావం .. పరిగెత్తాలనే పట్టుదల ఉన్నాయి. ముందుగా కెమెరా వెనుక పనిచేస్తూ .. అవకాశాన్ని బట్టి చిన్న చిన్న పాత్రలను చేస్తూ తాము అనుకున్నది సాధించినవారిగా రేలంగి .. ఎల్వీ ప్రసాద్ వంటివారు కనిపిస్తారు. అదే బాటలో రవితేజ అడుగులు వేయడం విశేషం. చిరంజీవి .. బాలకృష్ణ .. నాగార్జున .. వెంకటేశ్ .. జగపతిబాబు వంటి స్టార్ హీరోలు బరిలో ఉండగా ఎలాంటి నేపథ్యం లేకుండా సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టడం ఒక సాహసమైతే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడం మరో విశేషం. పిట్టపిల్ల సముద్రాన్ని చూసి భయపడితే దానిపై ఎగరలేదు. అలాగే ఎలాంటి జంకు లేకుండా రవితేజ చేసిన ప్రయత్నాలు .. ప్రయోగాలే ఆయనను ఒక్కోమెట్టు పైకెక్కిస్తూ వెళ్లాయి. 1968 జనవరి 26వ తేదీన 'జగ్గంపేట'లో జన్మించిన రవితేజ ఆ తరువాత కాలంలో సినిమాలపై ఆసక్తిని పెంచుకుని ఆ దిశగా అడుగులు వేశాడు. 1990లో 'కర్తవ్యం' సినిమాలో ఒక చిన్న పాత్రను చేసిన ఆయన ఆ తరువాత కృష్ణవంశీ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్ గా చేరాడు. అసిస్టెంట్ డైరెక్టర్ గా చేస్తూనే 'నిన్నే పెళ్లాడుతా' వంటి సినిమాల్లో చిన్న చిన్న పాత్రలను చేస్తూ వెళ్లాడు. రవితేజలోని ఈజ్ .. ఆయన ఎనర్జీని చూసిన కృష్ణవంశీ 'సిందూరం' సినిమాలో సెకండ్ హీరోగా ఛాన్స్ ఇచ్చారు. 'నీ కోసం' సినిమాతో ఆయనను సోలో హీరోగా శ్రీను వైట్ల తెరపైకి తీసుకుని వచ్చాడు. ఇక అప్పటి నుంచి రవితేజ వెనుదిరిగి చూసుకోలేదు. 'ఇటు శ్రావణి సుబ్రమణ్యం' .. 'ఇడియట్' .. 'అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి' సినిమాలతో ఆయనకి పూరి స్టార్ డమ్ తీసుకొచ్చాడు.రవితేజ చాలా హిట్లు ఇచ్చి ఉండొచ్చు. కానీ ఆయన కెరియర్లో కీలకమైన పాత్రలను పోషించిన దర్శకులుగా కృష్ణవంశీ .. శ్రీను వైట్ల .. పూరి జగన్నాథ్ కనిపిస్తారు.

# వాళ్లిద్దరు నా ఫేవరెట్ ప్లేయర్లు... ఐపీఎల్‌లో ఆ జట్టుకు ఆడాలని ఉంది: దక్షిణాఫ్రికా యువ సంచలనం ఏబీడీ 2.౦!



ఐపీఎల్.. కాసులు కురిపించే లీగ్... ఒక్కసారి ఇందులో ప్రతిభ నిరూపించుకుంటే చాలు కావాల్సినంత డబ్బు... పాపులారిటీకి పాపులారిటి వస్తాయి. మరి ఇలాంటి క్యాష్ రిచ్ లీగ్‌లో పాల్గొనాలని ఆటగాళ్లు కోరుకోవడం సహజమే కదా! దక్షిణాఫ్రికా యువ సంచలనం డేవాల్డ్ బ్రెవిస్ కూడా ఇదే మాట అంటున్నాడు. ఐపీఎల్‌లో తనకు ఆడాలని ఉందని, అవకాశం వస్తే రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు ఆడతానని చెప్పుకొచ్చాడు.వెస్టిండీస్ వేదికగా జరుగుతున్న ఐసీసీ అండర్ 19 వరల్డ్‌కప్ టోర్నీలో బ్రెవిస్ అదరగొట్టిన సంగతి తెలిసిందే. ఆడిన 4 మ్యాచ్‌లలో 362 పరుగులు సాధించాడు. లీగ్ స్టేజ్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా తన పేరును లిఖించుకున్నాడు. ఈ క్రమంలో బ్రెవిస్ ఆట తీరు దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఏబీ డివిల్లియర్స్‌ను గుర్తు చేస్తోందంటూ.. అతడికి ఏబీడీ 2.0గా పేరు పెట్టారు ఫ్యాన్స్. అంతేగాక అతడు ఆర్సీబీ జెర్సీలో ఉన్న ఫొటో కంటపడటంతో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇస్తున్నావా అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్రెవిస్ ఐసీసీ అధికారిక వెబ్‌సైట్‌తో మాట్లాడుతూ... అన్ని ఫార్మాట్లలోనూ జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాడు. అదే విధంగా ఏబీ డివిల్లియర్స్, విరాట్ కోహ్లి తన ఫేవరెట్ క్రికెటర్లు అన్న బ్రెవిస్... ఐపీఎల్‌లో ఆడే అవకాశం వస్తే... ఆర్సీబీకి ఆడతానని పేర్కొన్నాడు. ఈ మేరకు... "ప్రొటిస్‌కు ఆడటం తన అతిపెద్ద కల. ఐపీఎల్‌కు నేను పెద్ద అభిమానిని. ఏబీడీ, కోహ్లి వంటి దిగ్గజాలు ఆడిన ఆర్సీబీకి ఆడటాన్ని నేను ఇష్టపడతా. ఆల్‌రౌండర్‌గా ఎదిగి జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడంతో పాటు... ప్రపంచవ్యాప్తంగా అన్ని లీగ్‌లలోనూ ఆడాలని భావిస్తున్నా" అని బ్రెవిస్ తమ మనసులోని భావాలు పంచుకున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190